సాక్షి కాకినాడ

శనివారం । 9 । డిసెంబర్ । 2023



రూ.1,00,116 విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి యక్కల వెంకట రాజారావు, లక్ష్మి దంపతులు (రావులపాలెం) శుక్రవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

అమ్మవారికి మకర తోరణం



పిఠాపురం: పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరి అమ్మవారికి పట్టణంలోని మిరపకాయల వీధికి చెందిన కస్తూరి చిన్నబాబు, కృష్ణవేణి దంపతులు శుక్రవారం 9 కేజీల వెండి మకర తోరణాన్ని సమర్పించారు.

మిగులు జలాలు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 12,124 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

750 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం

ఉద్యానశాఖ ఏడీ మల్లిఖార్జున్



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ ఏడీ మల్లిఖార్జున్

కొత్తపల్లి: తుపాను కారణంగా జిల్లాలో సుమారు 750 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ఉద్యాన శాఖ ఏడీ మల్లిఖార్జున్ చెప్పారు. గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. వర్షాలకు దెబ్బతిన్న ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున్ మాట్లాడుతూ గొల్లప్రోలు మండలంలో 192 హెక్టార్లు, పిఠాపురం మండలంలో 43 హెక్టార్లలో అరటి పంటకు నష్టం వాటిల్లిందన్నారు. నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, రైతులు ఉన్నారు.

ముంపు నుంచి తేరుకున్న జిల్లేడుపాడు

- గ్రామంలో పర్యటించిన డీపీఓ భారతీ సౌజన్య
- ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

తుని రూరల్: పంపా రిజర్వాయర్‌లోని అదనపు జలాలు, పుష్కర కాలువ వరద నీరు పోటెత్తడంతో నీట మునిగిన జిల్లేడుపాడు గ్రామం శుక్రవారానికి తెరుకుంది. పంపా, పుష్కర జలాలు ఒక్కసారిగా దిగువకు విడుదలవ్వడంతో తుని మండలం హంసవరం శివారు జిల్లేడుపాడు గ్రామాన్ని ముంచేత్తిన విషయం తెలిసిందే. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాలతో రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. రాత్రంతా పునరావాస కేంద్రంలో తల దాచుకున్న గ్రామస్తులు ముంపు వీడడంతో శుక్రవారం ఇళ్లకు చేరుకున్నారు. జిల్లా పంచాయతీ రాజ్ అధికారి కె.భారతీ సౌజన్య గ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ముంపు బాధితులతో మాట్లాడి వారికి అందుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. వరద పూర్తిగా తగ్గుముఖం పట్టిందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు ధైర్యం చెప్పారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులను గ్రామంలో అందుబాటులో ఉంచామన్నారు. సర్పంచ్ రాయి మేరీ అవినాష్ ఆధ్వర్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ పనులు నిర్వహించారు. తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. అయ్యప్పస్వాముల సౌజన్యంతో ముంపు బాధితులకు మధ్యాహ్నం భోజనాలు అందించారు. అలాగే తేటగుంట శివారు గవరపేటలో పుష్కర కాలువ నుంచి ప్రవహించే వరదనీరు తగ్గుముఖం పట్టింది. ఈఓపీఆర్డీ జయరామ్, సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ఇంటింటికీ వెళ్లి అంటువ్యాధులుపై అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు.

అండగా ఉన్నా అక్కసేనా..?

- **తుపాను సాయంపై 'ఈనాడు' పచ్చ రాతలు**
- **రైతులను పట్టించుకోవడం లేదని నిందలు**
- ప్రభుత్వం అండగా నిలిచినా దుష్ప్రచారం
- విషపు రాతలపై రైతుల మండిపాటు
- రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం
- వానలోనూ ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు
- అందుబాటులో అవసరమైనన్ని గోనె సంచులు

ధాన్యం కొనుగోలు లక్ష్యం: 2.61 లక్షల మెట్రిక్ టన్నులు
ధాన్యం విక్రయించిన రైతులు: 10,756
సేకరించిన ధాన్యం: 64,034 మెట్రిక్ టన్నులు
చెల్లించిన నగదు: రూ.123.62 కోట్లు
చెల్లించాల్సిన మొత్తం: 15.89 కోట్లు
సంచుల ఆవశ్యకత: 65,00,000
ఇప్పటికే ఇచ్చినవి: 23,00,000
సిద్ధంగా ఉంచినవి: 41,00,000



సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి రాజమహేంద్రవరం: తుపాను సమయంలో అన్న దాతలకు ప్రభుత్వం అండగా ఉడటాన్ని జీర్ణించుకోలేని 'ఈనాడు' విష ప్రచారానికి తెర తీసింది. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్ర స్థాయిలో రైతుల కు వెన్నుదన్నుగా నిలుస్తున్నా సన్నద్ధ త లేదంటూ తప్పుడు రాతలకు బరితె గించింది. అవసరమైనన్ని గోనె సంచులు అందుబాటులో ఉంచినా.. అవేమీ పట్టనట్టు కట్టుకథ అల్లింది. తుపాను ప్రభావంతో వర్షం కురుస్తున్నా.. కళ్లాల్లో ధాన్యాన్ని కొంటున్నా.. తేమ పేరుతో కొర్రీలు పెడుతున్నారని ప్రచురించిన అసత్య కథనాన్ని రైతులు చీద రించుకుంటున్నారు. తాము కష్టాల్లో ఉన్నప్పుడు టీడీ పీ, జనసేన నేతలు పొలాల వైపు కన్నెత్తయినా చూడలేదని విమర్శిస్తున్నారు. ఇలాంటి నేతలపై ఎలాంటి రాతలూ రాయకుండా.. మంచి చేస్తున్న ప్రభుత్వంపై బురద జల్లుతున్న తీరును ఎండగడుతున్నారు.

ఈనాడు ఆరోపణ–1: అధికార యంత్రాంగం అండ లేక తీవ్రంగా నష్టపోయిన రైతులు.

సమాధానం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరి, ఇతర పంటలు నీట మునిగాయి. ఖరీఫ్ కోతలున్న నేపథ్యంలో ధాన్యం తడిసి, రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అండగా నిలించింది. కలెక్టర్లతో సహా జిల్లా స్థాయి అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లను క్షేత్ర స్థాయికి పంపించి, గింజ కూడా నష్టపోకుండా కొనుగోలు చేసి, అండగా నిలిచింది. ఆన్‌లైన్‌లో ప్రక్రియ ఆలస్యమవుతుందనే ఉద్దేశంతో ఆఫ్‌లైన్‌లో కొనుగోళ్లు చేపట్టింది. తేమ ఉన్నా మిల్లులకు తరలించింది. రైతులకు అవసరమైన సదుపాయాలన్నీ కల్పించింది. రాత్రి వరకూ ఉండి మరీ ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియ చేపట్టింది. కోనసీమ జిల్లాలో తుపాను రెండు రోజుల వ్యవధిలో ఆఫ్‌లైన్‌లో 48,470, తూర్పు గోదావరి జిల్లాలో 8,799, కాకినాడ జిల్లాలో 13,800 మెట్రిక్ టన్నులు కొన్నారు. ముందస్తుగా అప్రమత్తమై కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు సూచనలు అందించారు. ఇవన్నీ పట్టని ఈనాడు తప్పుడు కథనం ప్రచురించింది.



కాట్రావులపల్లిలో ధాన్యం బస్తాలను మిల్లుకు తరలింపజేస్తున్న అధికారులు

ఆరోపణ–2: ఏ మూలకూ చాలని సంచులు.

సమాధానం: ధాన్యం సేకరణకు అవసరమైన సంచులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచారు.

తూర్పు గోదావరి జిల్లాకు 63 లక్షల గోనె సంచులు అవసరం కాగా, 232 ఆర్‌బీకేల్లో 55,82,567 (88.61%) సంచులు అందుబాటులో ఉంచారు. ఇవేమీ పరిశీలించకుండా తప్పుడు ఆరోపణలతో కథనం అల్లారు.

ఆరోపణ–3: తడిసిన ధాన్యం పరిశీలిస్తున్నారే తప్ప తరలింపునకు చర్యలు లేవు.

సమాధానం: ప్రభుత్వం ఆఫ్‌లైన్‌లో కొనుగోలుకు అవకాశం ఇచ్చింది. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని తేమ శాతం నిబంధనతో సంబంధం లేకుండా కొనుగోలు చేశారు. తేమ శాతాన్ని 17 నుంచి 18కి పెంచారు. కనీస మద్దతు ధర ఇచ్చారు. 19 శాతం ఉంటే కేజీ చొప్పున, 20 శాతం ఉంటే 2 కేజీల చొప్పున తీసుకుని కొనుగోలు చేస్తున్నారు. ఈ పద్ధతిలో కోనసీమలో గురువారం ఒక్క రోజే 9,200 మెట్రిక్ టన్నులు కొన్నారు. ఇది ఈనాడు కళ్లకు కనిపించలేదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఆరోపణ–4: ఆర్‌బీకేలు ఎందుకంట?

సమాధానం: ధాన్యం కొనుగోలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించడంలో కీలక భూమిక పోషిస్తున్న ఆర్‌బీకేలు ఎందుకని ప్రశ్నిస్తుంటే రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం విక్రయించినా ఒక శాతం తరుగు తీసుకుంటున్నారని, మరికొందరు బస్తాకు రూ.12 వందలే ఇస్తున్నారంటూ అసత్య కథనం వండి వార్చింది. తేమ శాతాన్ని 17 నుంచి 18కి పెంచి, ఆపై వస్తే కిలో మాత్రమే తీసుకుని కొనుగోలు చేస్తున్నా.. కనీస జ్ఞానం లేకుండా అక్కసు వెళ్లగక్కుతోందని రైతులు అంటున్నారు.



చదలవాడలో తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



సిరిపురంలో తహసీల్దార్ శ్రీనివాసరావు దగ్గరుండి ధాన్యాన్ని పట్టుబడి చేయిస్తున్న దృశ్యం



వలసపాకలలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తడిసిన ధాన్యం కొని కాపాడారు



తుపానుకు ధాన్యం తడిసిపోయాయి. ధాన్యం అమ్ముడుపోవని భయపడ్డాను. బస్తాకు రూ.400 నుంచి రూ.500 వంతున కమిషన్ ఏజెంట్‌కు పోతుందనుకున్నాను. ఇంతలో ప్రభుత్వం స్పందించి నిబంధనలు సడలించింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకుంటుంది. వర్షం కురుస్తున్నా అధికారులు వచ్చి 97.20 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి నా ప్రాణం నిలబెట్టారు. లేదంటే అన్యాయం పూర్తిగా నష్టపోయేవాడిని.


– బుర్ర చక్రధర్, అచ్చంపేట, సామర్లకోట మండలం

ఆఫ్‌లైన్‌లో కొన్నారు



15 ఎకరాల్లో వరి సాగు చేశాను. 360 బస్తాల దిగుబడి వచ్చింది. తుపాను ప్రభావంతో వర్షం కురవడంతో ఎలా అమ్ముకోవాలో దిక్కుతోచని పరిస్థితి. అధికారులను ఆశ్రయించడంతో ఆలస్యం లేకుండా ఆఫ్‌లైన్‌లో కొన్నారు. ఇప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నారు. ధాన్యం సరఫరాకు ట్రాక్టర్, గోనె సంచులు కూడా సమకూర్చారు. ఎలాంటి ఇబ్బందీ లేకుండా, గింజ కూడా నష్టపోకుండా విక్రయించుకున్నా. – కొత్తపల్లి సత్యనారాయణ, రైతు, సమిశ్రగూడెం, తూర్పు గోదావరి జిల్లా

నిబంధనలతో ఇబ్బంది పెట్టలేదు



రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేశాను. 70 బస్తాల దిగుబడి వచ్చింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంటే ధాన్యాన్ని పొలంలోనే పట్టలు కప్పి ఉంచాను. ఆన్‌లైన్ చేయాలన్న నిబంధనలు ఏమీ లేకుండా అధికారులు ధాన్యం కొన్నారు. వర్షం తెరిపివ్వడంతో ఈ రోజు మిల్లులకు తోలేశాను. అవసరమైన సంచులు అందుబాటులో ఉంచారు.

గూడపాటి పోలేశ్వరరావు, రైతు, సమిశ్రగూడెం

డేటా ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం

కాకినాడ సిటీ: జిల్లా సర్వే, భూమి రికార్డుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా డేటా ప్రాసెసింగ్ సెంటర్‌ను కలెక్టర్ కృతికా శుక్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియతో కలసి శుక్రవారం ప్రారంభించారు. అత్యాధునిక సాంకేతికత పరికరాలతో చేపట్టిన రీసర్వే ప్రక్రియలో సేకరించిన డిజిటల్ సమాచారాన్ని మ్యాపింగ్ చేసేందుకు ఈ డేటా సెంటర్ ఉపకరిస్తుంది. ఈ సందర్భంగా జిల్లా సర్వే విభాగానికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. జిల్లా సర్వే, భూమి రికార్డుల శాఖ అధికారి బి లక్ష్మీనారాయణ, మండల, గ్రామ సర్వేయర్లు, కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

పీబీసీ గండి నివారణకు శాశ్వత చర్యలు

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

కొత్తపల్లి: ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టేలా కలెక్టర్‌తో చర్చించి చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. గొల్లప్రోలు మండలంలో మంపునకు గురయిన ఏకే మల్లవరం, చేబ్రోలు–మల్లవరం రోడ్డులో పీబీసీ కాలువకు పడిన గండిని ఆయన శుక్రవారం పరిశీలించారు. తడిసిన ధ్యాన్యపు రాశులను చూశారు. పొల్లాలో నీట మునిగిన వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పీబీసీ కాలువ గండితో పాటు ఈ ప్రాంతం ముంపునకు గురికాకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టే విధంగా అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ కృత్తికా శుక్లా సమీక్షిస్తారన్నారు. ఆయన వెంట ఆత్మ చైర్మన్ కడింశెట్టి భాస్కరరావు, జెడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు తదితరులు ఉన్నారు.



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

రత్నగిరి.. జనసంద్రం

అన్నవరం: కార్తిక బహుళ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. వ్రతమండపాలు, ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయాయి. సుమారు 60 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. స్వామివారి వ్రతాలు 6,987 జరిగాయి. సత్యదేవుని దర్శనానికి రెండు గంటలు, ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.60 లక్షలు ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

ఈ ఏడాది కార్తికంలో తగ్గిన రద్దీ

సాధారణంగా కార్తిక మాసంలో భక్తుల్లో 50 శాతం మంది తెలంగాణ నుంచి వచ్చేవారే ఉంటారు. ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా వస్తారు. ఎన్నికల ప్రభావంతో ఈసారి తగ్గిపోయారు. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి కూడా కార్తిక మాసంలో భక్తులు వస్తారు. తుపాను కారణంగా పలు రైళ్లు రద్దు అవ్వడంతో ఈ ఏడాది గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి వచ్చే భక్తులు కూడా తగ్గిపోయారు. ఫలితంగా ఈ కార్తిక మాసంలో వ్రతాలు బాగా తగ్గిపోయాయి. గతేడాది కార్తిక మాసంలో బహుళ ఏకాదశి నాడు 13,453 వ్రతాలు జరుగ్గా ఈ ఏడాది కేవలం 6,987 వ్రతాలు జరిగాయి.

క్లుప్తంగా

బ్లేడ్ బ్యాచ్ వ్యక్తులకు కఠిన కారాగార శిక్ష

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): హత్యాయత్నం కేసులో బ్లేడ్ బ్యాచ్‌కు చెందిన ఇద్దరు ముద్దాయిలకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపాల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్ట్ జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. వివరాలివీ.. 2021 సెప్టెంబర్ 9న క్వారీ మార్కెట్‌కు చెందిన రేగుళ్ల వినోద్ అలియాస్ గింజా, చర్నా రాజ్‌కుమార్‌లు అదే ప్రాంతానికి చెందిన పిన్నింటి సాయిబాబా ఇంటికి వెళ్లారు. సమీపంలోని బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు తీసుకుని వెళ్లారు. తమ విషయాల్లో ఎందుకు కలుగజేసుకుంటున్నావని, చంపేస్తామంటూ సాయిబాబాను వినోద్ పట్టుకోగా.. రాజ్‌కుమార్ బ్లేడుతో అతడి మెడపై కోశాడు. భయంతో సాయిబాబా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. దీంతో వినోద్, రాజ్‌కుమార్ పరారయ్యారు. బాధితుడు సాయిబాబా ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ సెషన్స్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోడి సతీష్‌నాయుడు బలమైన వాదనలు వినిపించారు. నిందితుల అసాంఘిక కార్యకలాపాలు, నేరాల చిట్టాలను కోర్టు ముందుంచారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో రేగుళ్ల వినోద్, చర్నా రాజ్‌కుమార్‌లకు పైవిధంగా శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. కేసు దర్యాప్తు, నిందితులకు శిక్ష పడటంలో ప్రాసిక్యూషన్ నిర్వహించిన ఏపీపీ సతీష్ నాయుడు, త్రీటౌన్ సీఐ వీరయ్యగౌడ్, ఎస్సై టి.శ్యామ్ సుందర్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎస్.వెంకటేశ్వరావును జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

అత్తింటి వేధింపులపై మహిళ ఫిర్యాదు

ముమ్మిడివరం: పెళ్లి సమయంలో పుట్టింటి వారు తనకు ఇచ్చిన భూమిని తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలంటూ భర్త, అత్తింటి వారు తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని గేదెల్లంకకు చెందిన నిమ్మన మల్లిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. మల్లికకు, అంబాజీపేటకు చెందిన నామన యోగేష్ అంజుకుమార్‌కు గత మే నెలలో వివాహం జరిగింది. ఆ సమయంలో పుట్టింటి వారు రెండెకరాల భూమి, రూ.6 లక్షల నగదు, రెండు కేజీల వెండి, 25 కాసుల బంగారం ఇచ్చారు. అంజుకుమార్‌కు ఉన్నత స్థాయి ఉద్యోగం అని నమ్మించి వివాహం జరిపించారు. అప్పటి నుంచీ అతడు అధికంగా మద్యం తాగి, పుట్టింటి వారిచ్చిన భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలంటూ చిత్రహింసలకు గురి చేస్తున్నాడని, అతడిని అత్త విజయలక్ష్మి, చిన్నత్త ఆకుల గంగా ప్రసన్న, ఆడపడుచు జవ్వాది సంధ్యా సావిత్రి, ఆమె భర్త గణేష్ కుమార్ ప్రోత్సహిస్తున్నారని మల్లిక తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ఎస్సై ఎస్.శివప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సమస్యలే.. మృత్యుపాశాలై..!

- కాశీ వెళ్లి కడతేరిపోయిన కుటుంబం
- భార్యాభర్తలు, ఇద్దరు కుమారుల సామూహిక ఆత్మహత్య
- మండపేటలో విషాదం

కపిలేశ్వరపురం (మండపేట): అమ్మ, నాన్న, ఇద్దరు కుమారులు.. ఉన్నంతలో సుఖసంతోషాలతో బతుకుతున్న కుటుంబం.. ఆర్థిక సమస్యలు పెను భారమయ్యాయి.. అవి తీరే దారి కానరాలేదు.. దీంతో వారి మనసులు కల్లోలభరితమయ్యాయి. ఈ పరిస్థితుల్లో మూడు నెలల కిందట తీర్థయాత్రల బాట పట్టారు.. ప్రముఖ పుణ్యక్షేత్రం వారణాసి చేరుకున్నారు. అప్పుల బాధ తీరే అవకాశాలు సన్నగిల్లడంతో ఉన్నట్టుండి ఈ లోకాన్ని వీడాలని నిర్ణయించుకున్నారు. 'కాశ్యాంతు మరణాన్ ముక్తిః' అన్నట్టు.. కాశీ క్షేత్రంలో మరణిస్తే ముక్తి లభిస్తుందనుకున్నారో ఏమో! నలుగురూ కలిసి ఊరు కాని ఆ ఊరిలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ విషాద సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణంలో తీవ్ర కలకలం రేపింది. మండపేట పట్టణ సీఐ అఖిల్ జామా కథనం ప్రకారం..

అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలకు చెందిన గుండవరపు కొండబాబు (50) కొన్నేళ్ల కిందట మండపేటకు వలస వచ్చాడు. పట్టణంలోని పలు షోరూముల్లో మోటార్ మెకానిక్‌గా పని చేసి, కొన్నాళ్లుగా సొంతంగా మెకానిక్ షెడ్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. భార్య లావణ్య (45), కుమారులు వీర వెంకట సూర్య మోహన్ రాజేష్ (25), జయరాజ్ కృష్ణ(23)తో కలిసి మండపేట సప్తగిరి రోడ్డులో నివాసముంటున్నాడు. పట్టణంలోని ఓ ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్న ఓ కుమారుడు ఆర్థిక లావాదేవీల సమస్యలో చిక్కుకున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులందరూ కలిసి గత సెప్టెంబర్ నెలలో తీర్థయాత్రలకు బయలుదేరారు. పలు ప్రాంతాలు తిరుగుతూ కాశీకి చేరుకున్నారు. అక్కడి ఆంధ్రాశ్రమంలోని కైలాష్ భవన్‌లో ఈ నెల 3న బస చేశారు. అక్కడ ఉంటూ పలు పుణ్య ప్రదేశాలను సందర్శించారు. అంతలోనే మనస్సుకు ఏం కష్టమొచ్చిందో ఏమో కానీ, కాశీలోనే చివరి శ్వాస వదలాలని నిర్ణయించుకున్నారు. దీంతో బస చేసిన కాటేజీలోనే నలుగురూ సామూహికంగా ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఎంతకూ గది నుంచి బయటకు రాకపోవడంతో కాటేజీ వారు ఉరి వేసుకున్నట్టు హౌస్ కీపర్ గురువారం సాయంత్రం గుర్తించి, అక్కడి దశాశ్వమేథ్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు.


గుండవరపు కొండబాబు, లావణ్య, వీర వెంకట సూర్య మోహన్ రాజేష్, జయరాజ్ కృష్ణ (ఫైల్)

తమకు అప్పులున్నాయని, వాటిపై వేధింపులు బాధించాయంటూ రాసిన సూసైడ్ లెటర్ ఆ కాటేజీలో లభ్యమైనట్టు సమాచారం. మృతుల వద్ద ఉన్న ఆధార్ కార్డుల ఆధారంగా వారణాసి పోలీసులు మండపేట పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై మండపేట పట్టణ సీఐ అఖిల్ జామా పర్యవేక్షణలో పట్టణ ఎస్సై అశోక్ శుక్రవారం దర్యాప్తు ప్రారంభించారు. మృతులు నలుగురూ మూడు నెలలుగా ఇక్కడ లేకపోవడం, స్థానికంగా వారికి బంధువులెవ్వరూ లేకపోవడంతో పూర్తి సమాచారం లభ్యం కావడం లేదని పోలీసులు తెలిపారు.

నేటి నుంచి 'నన్నయ'లో క్రీడా పోటీలు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆచార్య పద్మరాజు

రాజానగరం: సౌత్, వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ వుమెన్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదికవి నన్నయ యూనివర్సిటీ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో శనివారం ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖల మంత్రి ఆర్‌కే రోజా, బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, హోం మంత్రి తానేటి వనిత, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ పి.ధ్యానచంద్ర తదితరులు ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నన్నయ వర్సిటీ ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు శుక్రవారం పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, గోవా రాష్ట్రాల్లోని 90 యూనివర్సిటీల నుంచి పురుషుల జట్లు, 80 వర్సిటీల నుంచి మహిళా జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి.

సాత్విక్‌కు ఘన సత్కారం


సాత్విక్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, ఏషియన్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌ను శుక్రవారం కాకినాడలో ఘనంగా సత్కరించారు. హరీష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ, క్రీడల్లో రాణించేవారు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అన్నారు. సాత్విక్ మాట్లాడుతూ, ఏదైనా క్రీడలో లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడితే విజయం సాధించవచ్చని అన్నారు. అనంతరం హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్, డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్, సభ్యులు ఇమామ్, సుబ్బారావు, వీరబాబులు సాత్విక్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాత్విక్ తండ్రి కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను ఆదుకునేందుకు..

- పంట నష్టం అంచనాకు కదులుతున్న యంత్రాంగం
- ప్రభుత్వ ముందస్తు చర్యలతో తగ్గిన నష్టాల తీవ్రత

కొవ్వూరు: తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. నష్టాన్ని తగ్గించేందుకు దోహదపడ్డాయి. తుపాను హెచ్చరికలు జారీ చేసిన సమయానికి తూర్పు గోదావరి జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో జిల్లా అధికార యంత్రాంగం ప్రతి మండలానికి ప్రత్యేకాధికారితో పాటు ఎంపీడీఓ, తహసీల్దార్, వ్యవసాయ శాఖాధికారితో కమిటీలు ఏర్పాటు చేసింది. ఈ కమిటీలకు సహాయక చర్యలు, ధాన్యం సేకరణ బాధ్యతలు అప్పగించింది. సాధారణంగా తేమ శాతాన్ని పరిగణనలోకి తీసుకుని ధాన్యాన్ని ఆన్‌లైన్‌లో సేకరిస్తారు. కానీ ఒక్క రైతు కూడా నష్టపోకూడదన్న ఉద్దేశంతో ఈ నెల మూడో తేదీ నుంచే ఆఫ్‌లైన్‌లో ధాన్యం సేకరణ ప్రారంభించారు. జిల్లాలోని 70,827 హెక్టార్లలో వరి సాగు జరిగింది. తుపాను సమయానికి 46,416 హెక్టార్లలో మాసూళ్లు పూర్తయ్యాయి. మిల్లులకు తరలించినది మినహాయిస్తే కళ్లాల్లో, రైతుల వద్ద 24,316 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలున్నాయి. దీంతో అధికారులు గడచిన ఐదు రోజులూ తేమ శాతంతో సంబంధం లేకుండా 23,905 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి మిల్లులకు తరలించారు.

11 నుంచి నష్టాల అంచనా

ఇప్పటికే క్షేత్ర స్థాయిలో దెబ్బ తిన్న పంటలను పరిశీలించి, ప్రాథమిక అంచనాకు వచ్చిన అధికారులు.. ఈ నెల 11 నుంచి పంట నష్టం అంచనాలు పూర్తి స్థాయిలో తయారు చేయనున్నారు. ఇప్పటికీ జిల్లాలోని 2,700 హెక్టార్లలో పంట ముంపులోనే ఉంది. సుమారు 4 వేల హెక్టార్లలో నేలకు ఒరిగి ఉంది. ముంపు నుంచి పొలాలు బయట పడితే తప్ప నష్టం తీవ్రతను అంచనా వేయడం కష్టం. రెండు రోజుల నుంచి వర్షం తెరిపివ్వడంతో పంటలు నెమ్మదిగా ముంపు నుంచి బయట పడుతున్నాయి. రైతులు బోదెల ద్వారా నీటిని బయటకు పంపిస్తున్నారు.


తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట ప్రాంతంలో ముంపు బారిన పడిన పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు


చాగల్లులో దెబ్బ తిన్న అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

పంటల నష్టం ప్రాథమిక అంచనా ఇదీ.. (హెక్టార్లలో)

దెబ్బ తిన్న ఉద్యాన పంటలు	: 1,513.060
అరటి	: 902
కూరగాయలు	: 519.08
మిర్చి	: 39.2
పూలు	: 11.52
బొప్పాయి	: 26.10
పసుపు	: 2
మామిడి	: 2
ఆయిల్‌పామ్	: 2
నష్టపోయిన రైతులు	: 2,525
నష్టం అంచనా	: రూ.26.83 కోట్లు
ఇన్‌పుట్ సబ్సిడీ అంచనా	: రూ.3.78 కోట్లు

ఆహార పంటలకు వాటిల్లిన నష్టం (హెక్టార్లలో)

ముంపు బారిన పడిన వరి	: 2,709
కోత దశలో నేలకు ఒరిగింది	: 3,962
దెబ్బ తిన్న రబీ వరి నారుమళ్లు	: 254
వేరుశనగ	: 148.6
పత్తి	: 14.2
మినుము	: 456.4
రబీలో మొక్కజొన్న	: 2,812.6
చెరకు	: 7
మిర్చి	: 72
పొగాకు	: 2,157
శనగలు	: 734
పొద్దుతిరుగుడు	: 190
జొన్న	: 65
పంట నష్టం జరిగిన గ్రామాలు	: 198

80 శాతం సబ్సిడీపై విత్తనాలు



పంట దెబ్బ తిన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించేందుకు ప్రతిపాదనలు పంపించాం. జిల్లా వ్యాప్తంగా 710 క్వింటాళ్ల విత్తనాలు అవసరం. వీటిలో 52 టన్నులు శనగలు, మిగిలినవి వరి, మినుము, పెసర విత్తనాలున్నాయి. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులను ముందస్తుగా అప్రమత్తం చేయడం వలన నష్ట తీవ్రతను తగ్గించగలిగాం. 33 శాతం కంటే ఎక్కువ పంట దెబ్బ తిన్న రైతులందరికీ పంట నష్టపరిహారం అందిస్తాం. రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియను ప్రారంభిస్తాం.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

రాజమండ్రిలో రంగమ్మత్త

- నగరంలో సందడి చేసిన అనసూయ
- బీఆర్‌కే షాపింగ్ మాల్ ప్రారంభం


బీఆర్‌కే వస్త్ర దుకాణాన్ని ప్రారంభిస్తున్న సినీ నటి అనసూయ

రాజమహేంద్రవరం సిటీ: 'రంగస్థలం' సినిమాలో 'రంగమ్మత్త'గా మెప్పించిన ప్రముఖ సినీ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ శుక్రవారం రాజమహేంద్రవరంలో సందడి చేశారు. స్థానిక పుష్కర ఘాట్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్‌కే (బొమ్మన రాజ్‌కుమార్స్) షాపింగ్ మాల్‌ను అభిమానుల కోలాహలం నడుమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైవిధ్యభరితమైన డిజైన్లతో సంప్రదాయం, ఆధునికత కలబోసిన బీఆర్‌కే షాపింగ్ మాల్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. రాజమహేంద్రవరం పరిసరాల్లో తెలుగు సంస్కృతిని ప్రేమించే వినియోగదారుల అభిరుచులకు అద్దం పట్టే వెరైటీలు ఇక్కడ లభ్యమవుతాయని చెప్పారు. బీఆర్‌కే షాపింగ్ మాల్ అధినేత బొమ్మన రామచంద్రరావు మాట్లాడుతూ, పూజలు, పండగలు, వివాహాది శుభకార్యాలకు అవసరమైన అన్ని రకాల పట్టు, ఫ్యాన్సీ చీరలు, పురుషులకు, చిన్నారులకు సరికొత్త మోడల్స్‌లో అన్ని రకాల అధునాతన బ్రాండెడ్ దుస్తులు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కుర్తా పైజమా, పెళ్లి కుమారుడి దుస్తులు, ఇండోవెస్ట్రన్ సూట్స్, బ్లేజర్స్ వంటి వెరైటీలు లభిస్తాయన్నారు. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా వినూత్న వస్త్ర శ్రేణులు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వస్త్ర వ్యాపార రంగంలో బొమ్మన రాజ్‌కుమార్ ఒక బ్రాండ్‌గా నిలుస్తారని చెప్పారు. తండ్రి పేరు నిలబెట్టేందుకు రామచంద్రరావు బీఆర్‌కే వస్త్ర వ్యాపారం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌కే లోగోను అనసూయ, ఎంపీ భరత్‌రామ్ తదితరులు ఆవిష్కరించారు. అనంతరం అనసూయ డ్యాన్స్ చేసి అభిమానులను ఉర్రూతలూగించారు.


లోగోను ఆవిష్కరిస్తున్న అనసూయ, ఎంపీ మార్గాని భరత్‌రామ్ తదితరులు

ఉత్కంఠభరితంగా ఖోఖో మహిళా జట్టు ఎంపిక పోటీలు

తుని రూరల్: ఆదికవి నన్నయ యూనివర్సిటీ మహిళా ఖోఖో జట్టు ఎంపికకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. తుని మండలం వి.కొత్తూరులోని ప్రభుత్వం డిగ్రీ (అటానమస్) కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్ లలిత అధ్యక్షతన వర్సిటీ అంతర్ కళాశాలల ఖోఖో (మహిళ) టోర్నమెంట్ కం యూనివర్సిటీ టీం ఎంపిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా తుని మహిళా జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు, ప్రొఫెసర్ గంట్ల చిన్నారావు, నోబుల్ ఐటీఐ ప్రిన్సిపాల్ జీవీవీ సత్యనారాయణ, ఐడీబీఐ మేనేజర్ ఎం.శ్రీనివాస్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో తుని ఆదిత్య డిగ్రీ కళాశాల జట్టుపై తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. వర్సిటీ స్థాయి జట్టును శనివారం ప్రకటిస్తామని ఎంపిక కమిటీ సభ్యుడు కె.లోవ పాపారావు, టోర్నమెంట్ పరిశీలకురాలు వై.సుధారాణి (రాజమహేంద్రవరం ఎస్‌కేఆర్ కళాశాల) తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఓడీ బి.నాగరాజు, పీడీ ఎస్.రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి

సామర్లకోట: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీరమణి అన్నారు. స్థానిక టీటీడీసీలో శుక్రవారం జరిగిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్యాంకుల నుంచి మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సద్వినియోగమయ్యే విధంగా చూడాలని అన్నారు. మండల మహిళా సమాఖ్యల పనితీరును పరిశీలించేందుకు జిల్లా మహిళా సమాఖ్య కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండల సమాఖ్యలు చేసే వ్యాపారాల అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు మార్కెటింగ్‌పై అవగాహన కల్పించాలని అన్నారు. బ్యాంకు రుణాలతో పాటు స్త్రీనిధి రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో ఏర్పాటైన స్త్రీనిధి బ్యాంకును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సంఘాలపై ఉందని చెప్పారు. స్త్రీనిధి నిధులు దుర్వినియోగమైతే తీవ్రమైన చర్యలు తీసుకోవడానికి పేదరిక నిర్మూలన సంస్థ ప్రత్యేకాధికారి నిర్ణయించారని తెలిపారు. స్త్రీనిధిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని చెప్పారు. రికవరీలో ఉమ్మడి జిల్లాలో కాకినాడ ప్రథమ స్థానంలో ఉందని, దీనిని కొనసాగించేలా చూడాలని అన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి మండల సమాఖ్యలు ముందుకు వస్తే వారికి అవసరమైన శిక్షణ ఇవ్వడంతో పాటు ఇండస్ట్రియల్ ఏరియాలో స్థలం కేటాయిస్తామని తెలిపారు. ప్రజా సేవా కార్యక్రమాలపై కూడా జిల్లా సమాఖ్య సభ్యులు దృష్టి సారించాలని శ్రీరమణి సూచించారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఐ.కాంచన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు జి.కాంతం, కార్యదర్శి జి.సంధ్యారాణి, సహాయ కార్యదర్శి సీహెచ్ రత్నం, కోశాధికారి డి.నిర్మల, వైఎస్సార్ క్రాంతి పథం డీపీఎంలు బి.వెంకటేశ్వరరావు, ఐబీ డీపీఎం బాబూరావు, చేయూత డీపీఎం రాయ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

ప్రత్తిపాడు: కిర్లంపూడి మండలంలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. ఈ వివరాలు శుక్రవారం సాయంత్రం వెలుగులోకి వచ్చాయి. కిర్లంపూడి మండలం బూరుగుపూడి – రామవరం మధ్య జాతీయ రహదారి డివైడర్‌పై మొక్కల వద్ద గుర్తు తెలియని వృద్ధుని (65) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అతడి శరీరంపై గోచీ, తెల్లటి బనియన్ ఉన్నాయి. మృతదేహం వద్ద కర్ర, రగ్గు ఉన్నాయి. మృతదేహాన్ని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఆచూకీ తెలిసిన వారు కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై పి.ఉమా మహేశ్వరరావు కోరారు.

ఏలేరు కాలువలో మృతదేహం

కిర్లంపూడి మండలం గోనేడ గ్రామం వద్ద ఏలేరు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్తులు కనుగొన్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందించారు. కాలువ వంతెన వద్ద నీటిలో తల పైభాగం మాత్రమే కనిపిస్తోంది. సంఘటన స్థలాన్ని కిర్లంపూడి పోలీసులు పరిశీలించారు. చీకటి పడడంతో మృతదేహాన్ని వెలికి తీయలేదు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు పూర్వపు తూర్పు గోదావరి జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శుక్రవారం ఈ విషయం తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ప్రత్తిపాడు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ఈ లోక్ అదాలత్ జరుగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సునీత కోరారు.